సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం। 20। జనవరి। 2025

రోడ్డు భద్రత.. స్వీయ రక్షణ





సిరిసిల్ల: వాహనదారులు కుటుంబ సంక్షేమం కోసం స్వీయరక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ కోరారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం సిరిసిల్లలో పోలీసులు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ అలసత్వంతోనే రోడ్డు ప్రమాదాల జరిగి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల్లో మరణాలను తగ్గించవచ్చన్నారు. కొత్తబస్టాండ్ నుంచి బతుకమ్మఘాట్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, ఆర్ఐ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా వీహెచ్‌పీ శౌర్యయాత్ర



సిరిసిల్లలో త్రిశూల్ యాత్ర

సిరిసిల్లటౌన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్లలో త్రిశూల్‌దీక్ష, శౌర్యయాత్ర నిర్వహించారు. వందలాది సంఖ్యలో భజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొనగా..పట్టణంలో ప్రధాన వీధుల్లో శోభాయాత్ర జరిగింది. వీహెచ్‌పీ తెలంగాణ కన్వీనర్ శివ రాములు, జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, పట్టణాధ్యక్షుడు గుంటుకు పురుషోత్తం, భజరంగ్‌దళ్ పట్టణాధ్యక్షుడు బండారి సంతోష్, ఉపాధ్యక్షుడు కామిరె గౌతమ్, రాయిన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల శ్లోక పఠనం



బీవైనగర్‌లో చిన్నారులకు భగవద్గీత అందిస్తున్న నాయకులు

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల విహార్ ఆహుతులను అలరించింది. చిన్నారుల శ్లోకపఠనం ఆకట్టుకుంది. స్థానిక బీవైనగర్‌లోని శ్రీభక్తాంజనేయ ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అనంతరం తన తండ్రి భూమయ్య జ్ఞాపకార్థం చిన్నారులకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. చిన్మయ మిషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సజ్జనం శ్రీనివాస్, నల్ల సత్యనారాయణ, లకావత్ మోతీలాల్‌నాయక్, మేరుగు మల్లేశం, చంద్రప్రకాశ్, జక్కని రమేశ్, రాజమణి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్శరాములు



నియామకపత్రం అందిస్తున్న ఆర్.కృష్ణయ్య

వేములవాడఅర్బన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేములవాడ మండలం సంకెపల్లికి చెందిన రెడ్డవేణి పర్శరాం నియమితులయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామకపత్రం అందజేశారు.

గుట్టలు గుల్ల

ఈ చిత్రం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌లోని గుట్ట. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ గుట్టను జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లతో పేలుస్తూ కొల్లగొడుతున్నారు. పెద్ద పెద్ద బండలను పగులగొట్టి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రోడ్డు సమీపంలోనే ఈ పనులు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీని వెనుక అధికారులు, క్రషర్ వ్యాపారులకు మధ్య 'మామూలు' ఒప్పందాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



- ప్రకృతి సంపద దోపిడీ
- జిలెటిన్‌స్టిక్స్‌తో పేలుళ్లు
- గాయపడుతున్న సమీప రైతులు
- కరిగిపోతున్న కొండలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- 35 క్వారీలకే అనుమతి
- జిల్లాలో వందకు పైగా నిర్వహణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొందరు ధనదాహంతో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. గుట్టలను పేల్చుతూ కొండలను కరగదీస్తున్నారు. ఐదేళ్ల క్రితం కనువిందు చేసిన గుట్టలు, కొండలు నేడు బోసిపోయి కనిపిస్తున్నాయి. కొండలస్థానంలో నేడు గుంతలు, సాగుభూములుగా మారాయి. జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లతో పేలుస్తూ కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. ఇంత యథేచ్ఛగా జరుగుతున్నా ఇటు రెవెన్యూ, అటు మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులు క్వారీల నిర్వాహకులతో కుమ్మక్కవడంతోనే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే చర్చ సాగుతోంది. జిల్లాలో అక్రమంగా జరుగుతున్న పేలుళ్లు, క్వారీలు, క్రషర్ల తవ్వకాలపై 'సాక్షి' ఫోకస్.



పోలీసులు పట్టుకున్న కంప్రెషర్ ట్రాక్టర్

అనుమతులు 35 క్వారీలకే..

జిల్లా వ్యాప్తంగా రెండు మున్సిపాలిటీలు, 13 మండలాల వ్యాప్తంగా ఎటూ చూసిన క్వారీలు, క్రషర్లే కనిపిస్తున్నాయి. అయితే కనిపించే అన్నింటికీ అనుమతులు ఉన్నాయనుకుంటే పొరబాటు పడ్డట్టే. జిల్లాలో వందకు పైగా ప్రాంతాల్లో గుట్టలను తవ్వుతుంటే 35 క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో 23 గ్రానైట్ క్వారీలు కేవలం బోయినపల్లి మండలంలోనే ఉన్నాయి. మిగతా 12 మెటల్ క్వారీలు జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో ఉన్నాయి.

పేలుళ్లు.. ప్రమాదాలు

ధనార్జనే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఈ దందాలో అప్పుడప్పుడు పేలుళ్లతో ప్రమాదాలు జరిగి ప్రాణా లు పోతున్నాయి. బండలను పగులగొట్టేందుకు అక్రమంగా జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లతో పేలుళ్ల జరుపుతున్నారు. ఈక్రమంలో గతంలో బోయినపల్లి మండలం కోరెంలోని క్వారీలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయాడు. పేలుళ్ల జరుపుతు న్న క్రమంలో సమీపంలోని రహదారులపై నిర్వాహకులు జాగ్రత్తలు చెబుతూ వాహనాలు నిలిపివేస్తున్నారు. ఇలా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. అయితే కొన్ని సమయాల్లో పేలుళ్లను పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ఎగిరిపడుతున్న బండరాళ్లతో వాహనదారులు గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి.

అంతటా అక్రమాలే..

- ముస్తాబాద్ మండలం గూడెం శివారులోని సత్యనారాయణగుట్ట, నెమళ్లగుట్ట, నామాపూర్‌లోని పల్లగుట్టలను జిలెటిన్‌స్టిక్స్‌తో పేల్చి జేసీబీలతో చదునుచేశారు. ఇలా వచ్చిన రాళ్లను విక్రయించగా, మరోవైపు ఆ భూమిని చదునుచేసి పొలాలుగా మార్చారు.
- బోయినపల్లి మండలం కోరెం, గుడ్డేలుగులగుట్ట, వరదకాల్వల మట్టిని తరలిస్తూ అక్రమార్కులు క్యాష్ చేసుకుంటున్నారు.
- ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని గుట్టలు సగానికి పైగా మాయమయ్యాయి.
- చందుర్తి మండలంలోని లింగంపేట, తిమ్మాపూర్, నర్సింగపూర్, రామన్నపేట శివారులోని గుట్టలను అనుమతి లేకుండా పేలుస్తున్నారు. రాళ్లను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు.
- కోనరావుపేట మండలం మర్తనపేట, ధర్మారం గుట్టలను స్థానికులే డిటోనేటర్లతో పేల్చి రాళ్ల అమ్ముకుంటున్నారు.
- జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అనుమతులు లేకుండా గుట్టలను కొల్లగొడుతున్నారు. ఇదంతా అధికారులు కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరి స్తుండడం ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

పర్మిషన్ ఉన్నా క్వారీలపైనే పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా 35 క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఇందులో 23 గ్రానైట్, 12 మెటల్‌క్వారీలు ఉన్నాయి. మెటల్‌క్వారీలు క్రషర్లకు సంబంధించినవి. వాటిని మాత్రమే మేము తనిఖీ చేస్తాం. అక్రమాలు ఉంటే చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని క్వారీలపై రెవెన్యూ, పోలీస్ అధికారులే చర్యలు తీసుకోవాలి.

– క్రాంతి, మైనింగ్ ఏడీ

సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం



మన ప్రాంతంలో అనుమతులు లేకుండా జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లతో గుట్టలను పేలుస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలి. అక్రమంగా పేలుళ్ల జరుపుతుంటే కేసులు నమోదు చేస్తాం. జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు అనుమతి లేకుండా వాడడం నేరం. వాటిని ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారో నిఘా పెట్టి కట్టడి చేస్తాం.

– శ్రీనివాస్‌గౌడ్, సీఐ, ఎల్లారెడ్డిపేట

జాతీయస్థాయిలో ఉపాధ్యాయుడి ప్రతిభ

- రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలపై వీడియో ప్రదర్శన



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య

చందుర్తి(వేములవాడ): జాతీయస్థాయిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో చందుర్తి మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మేడికాల అంజయ్య ప్రతిభ చూపారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక, మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానంపై రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో ఉపాధ్యాయులకు డిసెంబర్ 26 నుంచి ఈనెల 15 వరకు 21 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 79 మంది హాజరు కాగా.. తెలంగాణ నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇందులో జిల్లాకు చెందిన అంజయ్య ఒకరు. ఈ సందర్భంగా అంజయ్య తెలంగాణ రాష్ట్ర భౌగోళిక స్వరూపం, రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు, రాష్ట్రం సాధించిన ప్రగతి, సంస్కృతి, సంప్రదాయాలు, మన పండుగలు.. తదితర 30 అంశాలపై 30 నిమిషాల వీడియోను ప్రదర్శించారు. ఇందుకు అంజయ్యకు రూ.25వేల టీచర్ స్కాలర్‌షిప్, ప్రశంసాపత్రం అందజేశారు. వీటిని సీసీఆర్టీ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్‌కుమార్ చేతులమీదుగా అందుకున్నారు.

నియామకం



సిరిసిల్లకల్చరల్: మున్నూరుకాపు సంఘం విద్యావంతుల రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన మాసం రత్నాకర్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కొండ దేవయ్య, చల్ల హరిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి రత్నాకర్ ధన్యవాదాలు తెలిపారు.

సాగుకు యోగ్యం లేనివి తొలగించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- సర్వే ఆకస్మిక తనిఖీ

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట: వ్యవసాయ యోగ్యం కాని భూములను క్షేత్ర స్థాయిలో గుర్తించి తొలగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం కోనరావుపేట మండలం మల్రిమడ్ల, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలం నర్మాల, గోరంటాలలో సర్వేను ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే కొనసాగుతుండగా కలెక్టర్ రికార్డులు పరిశీలించారు. రైతు భరోసా పథకం సాగుచేసే రైతులందరికీ అందుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యంకాని భూములను తొలగించాలని సూచించారు. రేషన్‌కార్డుల కోసం పలువురు కలెక్టర్‌ను కోరగా.. త్వరలోనే ఇస్తామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు.



వీర్నపల్లి మండలంలో సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

విద్యాలయం ఆకస్మిక తనిఖీ

మల్రిమడ్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులు, హాస్టల్ భవనం, డైనింగ్‌హాల్, కిచెన్, స్టోర్‌రూమ్ పరిసరాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కామన్ మెనూ అమలుపై ఆరా తీశారు. ప్రహరీ పూర్తిగా నిర్మించాలని, బోర్‌వెల్ వేయించాలని కలెక్టర్‌కు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ విన్నవించారు. ప్రహరీ, బోర్‌వెల్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కోనరావుపేట ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు విజయ్‌ప్రకాశ్‌రావు, మారుతిరెడ్డి, రాంచందర్, భూపతి, శంకర్‌రెడ్డి, వాజిద్, సత్తయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సింగిల్‌విండోలు బలోపేతం



గోదాంకు స్థలం ఇచ్చిన వైద్యుడు ఆనందరెడ్డి, విప్ ఆది శ్రీనివాస్‌లకు గజమాలతో సన్మానం

- రైతులను రాజులుగా చేయడమే లక్ష్యం
- 26 నుంచి నాలుగు పథకాలు అమలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): దివాళ తీసిన సింగిల్‌విండోలు కాంగ్రెస్ పాలనలోనే ఆర్థికంగా బలోపేతమయ్యాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, రామరావుపల్లిలో గోదాంలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. రైతును రాజులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు రైతులకు రుణాలతోపాటు ధాన్యం కొనుగోలు, ఎరువుల బస్తాల విక్రయాలు, పెట్రోల్‌బంక్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందొద్దని, ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. ఈనెల 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని తెలిపారు. కేడీసీసీబీ డైరెక్టర్ వుచ్చిడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల పరిధిలో రైతులు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ పిల్లలను విదేశాలకు పంపించేందుకు కావాల్సిన రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

గోదాం స్థలదాతకు సన్మానం

రామరావుపల్లిలో ప్రాథమిక సహకార సంఘం గోదాం నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన అమృత నర్సింగ్ హోం వైద్యుడు ముష్క ఆనందరెడ్డిని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను గ్రామస్తులు గజమాలతో సన్మానించారు. సనుగుల సింగిల్‌విండో అధ్యక్షుడు, కేడీసీసీబీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, వేములవాడ సింగిల్‌విండో అధ్యక్షుడు ఏనుగు తిరుపతి రెడ్డి, సనుగుల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముష్క ముకుందరెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాల్, సీఈవో శ్రీవర్ధన్, రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షులు చెలుకల తిరుపతి, నారాయణరెడ్డి, వినోద్, ఉపాధ్యక్షులు బొజ్జ మల్లేశం, పార్టీ అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

యువతకు ప్రోత్సాహం కరువు

- ఊసేలేని జాతీయ సమైక్యత శిబిరాలు
- పట్టింపు లేని యువజన సంఘాలు
- నియామకాలు లేని ఎన్ఎస్‌వీ వ్యవస్థ



రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): 'ఇనుప కండరాలు.. ఉక్కు నరాలు.. వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం' అన్న స్వామి వివేకానంద మాటలను ప్రస్తుత ప్రభుత్వాలు మరిచినట్లు ఉన్నాయి. ఒకప్పుడు యువజన సంఘాలను ప్రోత్సహించడం ద్వారా గ్రామాల్లో యువత ప్రాముఖ్యతను చాటిచెప్పాయి. యువజన సంఘాలు సైతం గ్రామాల్లో శ్రమదానాలు.. రక్తదాన శిబిరాలు.. ఆరోగ్యశిబిరాలు పెడుతూ ఆదర్శంగా నిలిచేవి. ప్రస్తుతం యువజన సంక్షేమం పడకేసింది. ఏటా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నా యువత పాత్ర అంతంతే ఉంది. ఈనెల 12 నుంచి 19 వరకు యువజనోత్సవాలు నిర్వహించినా యువత గురించి పెద్దగా పట్టించుకున్న వారు లేరు. దీనిపై ప్రత్యేక కథనం.

కొత్తగా మై భారత్ పోర్టల్

కరీంనగర్‌లో నెహ్రూ యువకేంద్రం యువజన కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది. నెహ్రూ యువ కేంద్రతో ఉమ్మడి జిల్లాలో సుమారు 818 వరకు యువజన సంఘాలు ఆన్‌లైన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో 200 వరకు యువజన సంఘాలు మాత్రమే యాక్టివ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఎన్‌వైకే కలిపి ప్రస్తుతం నెహ్రూయువ కేంద్ర కార్యక్రమాలు మై భారత్(మేరా యువభారత్) పోర్టల్‌లో చేపడుతున్నారు. గతంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏటా ఉత్తమ యువజన సంఘాలకు రూ.25వేల నగదు అవార్డు, వ్యక్తిగతంగా అవార్డులు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ ఊసే లేదు. ఉత్తమ యువజన అవార్డుల ఊసే లేదు. బ్లాక్ స్థాయి యువజన సంఘాల పరిధిలో క్రీడాపోటీలు మాట మరిచిపోయారు. మహిళలకు కుట్టుశిక్షణ, యువజన సంఘాలకు స్పోర్ట్స్ కిట్స్, యూత్ లీడర్‌షిప్ ట్రెయినింగ్ ప్రోగ్రాంలను నిర్వహించి యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించే వారు. గత మూడేళ్లుగా అలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు.

నియామకాలు లేని ఎన్ఎస్‌వీ

గ్రామాల్లో యువజన సంఘాలకు, నెహ్రూ యువ కేంద్రానికి మధ్య వారధిలా ఎన్ఎస్‌వీ(నేషనల్ సర్వీస్ వలంటీర్) ఉండేవారు. ఎన్ఎస్‌వీలు వారికి కేటాయించిన బ్లాక్‌ల పరిధిలోని గ్రామాల్లోని యువతను స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనేలా జాగృతం చేసేవారు. కాగా గత 2024 ఏప్రిల్ నుంచి ఎన్ఎస్‌వీల నియామకం లేదు. దీంతో గ్రామాల్లో యువజన సంఘాలు బలోపేతం కావడం లేదు.

శిబిరాలు పెట్టడం లేదు



ఒకప్పుడు ఉమ్మడి జిల్లా పరిధిలోని యువజన సంఘాల యువకులతో ప్రతీ వారం మారుమూల గ్రామాల్లో యువ వికాస శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. క్రీడలు, హెల్త్, బ్లడ్ క్యాంపులు, శ్రమదాన శిబిరాలు చేపట్టేవారు. ఇలా స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొన్న యువతకు నెహ్రూ యువకేంద్రం నుంచి రిపబ్లిక్‌డే, పంద్రాగస్టు, యూత్ డే వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందించేవారు. బ్లాక్‌స్థాయిలో శ్రమదానాలు, కళాబృందాల ద్వారా అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు.

– సోమినేని బాలు, యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు

సంఘాలను బలోపేతం చేయాలి



గ్రామాల్లో ఉన్న యువజన సంఘాలను గుర్తించి, వివిధ కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ ఇవ్వాలి. శ్రమదానాలను ప్రోత్సహించాలి. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న యువజన సంఘాలకు అవార్డులు ఇవ్వాలి. వ్యక్తిగతంగా యువజన అవార్డులు ఇవ్వాలి. కొన్నాళ్లుగా యువజన అవార్డులు లేక సంఘాలు కనుమరుగవుతున్నాయి.

– బోయిని రాజు, బోయినపల్లి

యువజన వారోత్సవాలు చేపడుతున్నాం



ఉమ్మడి జిల్లాలో ఎన్‌వైకే మై భారత్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 19 వరకు యువజన వారోత్సవాలు నిర్వహించాం. కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు రూ.25వేల చొప్పున బడ్జెట్ కేటాయించారు. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందిస్తాం. ఎన్ఎస్‌వీల నియామకం లేదు. యువజన సంఘాలకు, యూత్ అవార్డులు రెండేళ్లుగా ఇవ్వడం లేదు.

– రాంబాబు, యూత్ కో–ఆర్డినేటర్, నెహ్రూ యువకేంద్రం, కరీంనగర్

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

- గుర్తింపు సర్వే పక్కాగా నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: అర్హులకు పథకాలు అందించాలని, సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆదివారం ఆర్డీవోలు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రేషన్ కార్డుల జారీప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటికీ కార్డు లేని వారు కొత్తగా దరఖాస్తు అందజేయాలని సూచించారు. అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేస్తామని తెలిపారు. కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేస్తారని వివరించారు. ఈ అంశాలపై ఎలాంటి అపోహలు అవసరం లేదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు.

వ్యవసాయ యోగ్యం కాని భూములు గుర్తించాలి

జిల్లాలో వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సాగుచేసే రైతులందరికీ రైతుభరోసా అందుతుందని పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయ యోగ్యం కాని భూములను రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో సర్వేచేసి గుర్తించాలని మిగతా శాఖ అధికారుల నుంచి సమాచారం తీసుకుని భూములను పక్కాగా గుర్తించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంట సాగు వివరాలు, తహసీల్దార్ల వద్ద నాలా భూముల కన్వర్షన్ వివరాలు పరిశీలించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, డీఆర్డీవో శేషాద్రి, సీపీవో శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, ఎస్‌డీసీ రాధాభాయ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి, ఏడీ మైన్స్ క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కప్ అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో నూకలమర్రి, చెక్కపల్లి జట్లు పోటీ పడ్డాయి. విజేతగా నూకలమర్రి, రెండో స్థానంలో చెక్కపల్లి, మూడోస్థానంలో అనుపురం, నాలుగో స్థానంలో మానాల జట్లు నిలిచాయి. ఆయా జట్లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోనరావుపేట(వేములవాడ): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం రామన్నపల్లెకు చెందిన బత్తుల మల్లయ్య(35) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై బావుసాయిపేట వెళ్తున్నాడు. రామన్నపల్లె శివారులో వాహనం అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

తండ్రీకూతురికి గాయాలు..

గోదావరిఖని(రామగుండం): రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురికి గాయాలయ్యాయి. గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం.. గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన దొంగరి రాజమౌళి తన కూతురు తేజస్విని ఆదివారం ద్విచక్రవాహనంపై సింగరేణి జీఎం ఆఫీస్ వైపు వెళ్తున్నారు. వంకబెండు వద్ద మహమ్మద్ వహీద్ బైక్‌పై వచ్చి, ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తండ్రీకూతురు గాయపడ్డారు. కుటుంబసభ్యులు వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. రాజమౌళి తోడల్లుడు రాంచందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యానికి బానిసైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ(45) మద్యానికి బానిసైంది. నిత్యం డబ్బుల కోసం కూతురు పూజితను వేధిస్తోంది. ఆమె డబ్బులివ్వకుండా మద్యం సేవిస్తే అవయవాలు పాడవుతాయని బెదిరించింది. దీంతో మనస్తాపానికి గురైన నర్సవ్వ శనివారం రాత్రి తమ ఇంటికి ఎదురుగా ఉన్న వ్యవసాయ బావిలో దూకింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం బావిలో చూడగా నర్సవ్వ మృతదేహం కనిపించింది. మృతురాలి భర్త రాజలింగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటకెక్కిన ఆవాల పరిశోధన స్థానం



పాలాస వ్యవసాయ పరిశోధన స్థానం

- ప్రకటించి మూడేళ్లయినా అతీగతీ లేదు
- తాత్సారం చేస్తున్న జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి



జగిత్యాల జిల్లాలో సాగు చేసిన ఆవాల పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని ప్రకటించి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ఎలాంటి పురోగతి లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటికీ నిధులు విడుదల చేయకపోగా, శాస్త్రవేత్తలను నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధన స్థానం అటకెక్కినట్లేనని రైతులు ముచ్చటించుకుంటున్నారు.

ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనే దాదాపు 50 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. సాగుకు అవసరమైన ఎర్రనేలలు ఆయా జిల్లాల్లో ఉండటం, సాగు నీటి వసతి, 80–90 రోజుల్లోనే పంట చేతికి రావడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆవాల పంట ద్వారా తేనెటీగలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. రైతులు కొద్దిపాటి శిక్షణతో తేనెను ఉత్పత్తి చేసి మరింత ఆదాయం పొందవచ్చని, మన జిల్లాలో మామిడి ఎక్కువగా ఉండటంతో తేనెటీగల వల్ల పరపరాగ సంపర్కం జరిగి పిందె, కాయ వృద్ధి చెందే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, ఆవాల సాగుపై సలహాలు, సూచనలు కరువయ్యాయి.

ప్రైవేట్ కంపెనీల హవా

మన ప్రాంతాల్లో ప్రైవేట్ కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. బై బ్యాక్ పద్ధతిలో విత్తనోత్పత్తి చేపట్టి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తి కింద సాగు చేస్తే క్వింటాల్‌కు రూ.9 వేల వరకు ఇస్తున్నాయి. సాధారణ ఆవాలకు క్వింటాల్‌కు రూ.7–8 వేలు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు, ఆవాల పంటకు అడవి పందులు, రామచిలుకలు, కోతుల బెడద లేకపోవడం, పంటకు ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు 6–8 క్వింటాళ్ల దిగుబడి.. రూ.50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నా ఫలితం కనబడటం లేదు. దీంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోయింది.

ఆశలు అడియాసలే..

కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తుందని ప్రకటించడంతో స్థానిక రైతులు సంతోషించారు. కానీ, మూడేళ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో వారి ఆశలు అడియాసలవుతున్నాయి. రాష్ట్ర పరిధిలోని పరిశోధన స్థానాలతో పోల్చితే, కేంద్రం ఏర్పాటు చేసే పరిశోధన స్థానాల్లో నిధులకు ఇబ్బందులు ఉండవని, వివిధ రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు చర్చించుకునే అవకాశం ఉంటుందని రైతులు భ్రమించారు. తోటల్లో ప్రదర్శనలు, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని కలలు కన్నారు.

నివేదికలకే పరిమితం

కొన్నేళ్లుగా ఉత్తర తెలంగాణ(పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగు చేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ వర్సిటీతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికలు పంపించారు. జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంతృప్తి వ్యక్తం చేస్తూ సానుకూలంగా నివేదికలు తయారు చేసి కేంద్రానికి పంపింది. కరోనాకు ముందు జరిగిన పరిశోధన మండలిలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని కోరారు. ఈనేపథ్యంలో కేంద్రం ప్రకటించినా అతీగతీ లేకుండా పోయింది.

కొత్తగా రెండు సబ్ జైళ్లు



కరీంనగర్ జైలు

- సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో ఏర్పాటుకు జైళ్లశాఖ ప్రతిపాదనలు
- కార్యరూపం దాల్చితే కరీంనగర్ జైలుకు తప్పనున్న భారం

సిరిసిల్ల: సమాజంలో నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా.. ఖైదీలు, నిందితులతో జైళ్లు నిండిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జైలులో వీరి సంఖ్య పరిమితి మించి ఉంది. దీంతో రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో కొత్తగా సబ్ జైళ్ల ఏర్పాటుకు జైళ్ల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.

ఉమ్మడి జిల్లాలో మూడు..

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్‌లో ఒక జైలు, జగిత్యాల, హుజూరాబాద్‌లలో సబ్ జైళ్లు ఉన్నాయి. కరీంనగర్‌లో జైలులో 300 మంది ఖైదీలకే వసతులు ఉండగా.. 350 మంది వరకు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా ఖైదీలకు ప్రత్యేక బారక్స్ ఉండటంతో అందరికీ పూర్తిస్థాయిలో వసతుల్లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఇటీవల జైళ్ల శాఖ ఐజీ సౌమ్యమిశ్రా జైలును సందర్శించి, కొత్త జైళ్ల ఏర్పాటు ప్రతిపాదనలపై సమీక్షించినట్లు తెలిసింది.

నెలకు 60 మంది జైలుకు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 8 కోర్టుల్లో సిరిసిల్లలో రెండు, వేములవాడలో ఒక్క మున్సిఫ్ కోర్టులున్నాయి. వీటి ద్వారా ప్రతీ నెల సగటున 60 మంది కరీంనగర్ జైలుకు వెళ్తున్నారు. సిరిసిల్లలో ఇటీవలి కలంలో భూకబ్జాలు, గంజాయి సేవించేవారు, అమ్మేవారు, దొంగతనాలు, అత్యాచారాలు, పోక్సో కేసు, హత్యలు, హత్యాయత్నాలు, చీటింగ్ కేసులు పెరుగుతున్నాయి. ఇక్కడ సబ్ జైలు ఏర్పాటు చేస్తే.. ఈ ప్రాంతానికి చెందిన నేరస్తులు, నిందితులను ఇక్కడే ఉంచే అవకాశం ఉంటుంది.

సర్ధాపూర్ శివారులో ఏర్పాటు!

సబ్ జైలు కార్యరూపం దాల్చితే.. సిరిసిల్ల పట్టణ శివారులోని సర్ధాపూర్ వద్ద ఏర్పాటుకు అవకాశం ఉంది. అక్కడే 17వ పోలీస్ బెటాలియన్ ఉండగా.. 100 మంది ఖైదీలకు సరిపోయే సబ్ జైలు నిర్మాణానికి అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి.. సినారె



విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయేందర్ రెడ్డి, కవులు

కరీంనగర్ కల్చరల్: కల్మషం లేని మహా మనిషి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సినీ గేయ కవి సినారె అని పిల్లల వైద్య నిపుణుడు, సినారె కవితా పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన విశ్వంభరుడు అనే కవితా సంకలనాన్ని నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆవిష్కరించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. సినారె బహుభాషావేత్త అని, అలుపెరగని సాహితీ దిగ్గజమని కొనియాడారు. ఉదయ సాహితీ జిల్లా అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, కవులు అన్నాడి గజేందర్ రెడ్డి, నగునూరి రాజన్న, వేములవాడ ద్రోణాచార్యులు, గంప ఉమాపతి, బొమ్మకంటి కిషన్, పి.సత్యనారాయణరాజు, బొద్దుల లక్ష్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



సంక్రాంతి పురస్కార గ్రహీతలు..

సంక్రాంతి పురస్కారాలు ప్రదానం..

పురస్కారాలు బాధ్యతను పెంచుతాయని శతాధిక గ్రంథ ప్రచురణ కర్త, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. దూడపాక శ్రీధర్ అధ్యక్షతన ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించిన శ్రీ ఆర్యాణి సకల కళా వేదిక సంక్రాంతి ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గౌతమేశ్వర సాహితీ సేవా సంస్థ ప్రచురించిన ఇంతకీ నువ్వెవరు కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. జ్యోతిష్య, వాస్తు, పౌరోహిత్యం, చిందు యక్షగానం, సాహిత్యం తదితర రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గాయకుడు దీక్షితుల సుబ్రహ్మణ్యం, రచయిత ఒమర్ ఎజాస్ ఖాన్, కవి, సమీక్షకుడు పొర్ల వేణుగోపాల్‌రావు, యోగా గురువు కళాధరరావు, యోగ శిక్షకుడు బుర్ర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మృతుడు నిజామాబాద్ వాసి

కోరుట్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పేయింటర్స్ కాలనీకి చెందిన షేక్ రషీద్(25) శనివారం సాయంత్రం కోరుట్ల బీమునిదుబ్బలో ఉండే తన సోదరి ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి, జగిత్యాలలో ఉండే తన స్నేహితులను కలిసి, ఇంటికి వెళ్తానని చెప్పి, బైక్‌పై బయలుదేరాడు. వెంకటాపూర్ శివారులో జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వస్తున్న కోరుట్లకు చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రషీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కారు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టి, ఆగిపోయింది. ఆ వాహనంలో ఉన్న ఆడెపు రాజు, గాజంగి మహేశ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి పరిశీలించారు. మృతుడి సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

ఇల్లందకుంట(హుజూరాబాద్): బైక్ అదుపుతప్పి, ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేశ్(35) ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇల్లందకుంట మండలం పాతర్లపల్లిలోని అత్తగారింటికి వెళ్తున్నాడు. హుజూరాబాద్ మండల కేంద్రంలో వాహనం అదుపుతప్పడంతో మురికి కాలువలో పడిపోయాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య, రెండు నెలల పాప ఉన్నారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన బోర్‌వెల్ వాహనం

మల్యాల(చొప్పదండి): బోర్‌వెల్ వాహనం చెట్టును ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై నరేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. బోర్‌వెల్ వాహనం ఆదివారం కొడిమ్యాల నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై స్టీరింగ్ ఫెయిలవడంతో చెట్టును ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జవగా, లోపల ఉన్న బిహార్ కార్మికులు సురేందర్, భీమ్, బాలరాం, నిధేశ్‌లతోపాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

మిడ్‌మానేరులో తెప్పపై సిరిసిల్ల ఎస్పీ షికారు



తెప్పపై ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి(చొప్పదండి): ప్రతీరోజు శాంతిభద్రతల పర్యవేక్షణలో బిజీగా ఉండే ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం సరదాగా గడిపారు. బోయినపల్లి మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయ పరిసరాల్లో మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో కలిసి తెప్పపై షికారు చేశారు. కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వరకు తెప్ప రైడ్ చేస్తూ ఆనందపడ్డారు. వారి వెంట ఎస్సై పృథ్వీధర్ ఉన్నారు.

ఆలయంలో చోరీ

కరీంనగర్‌రూరల్: దుండగులు రెండు ఆలయాల్లో చొరబడి, ఒక ఆలయ హుండీ డబ్బులను చోరీ చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్ మల్లన్న, శ్రీభక్తాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయాల్లో మైక్ వేసేందుకు వెళ్లిన కూకట్ల మల్లయ్య, తొగరు ఎల్లారెడ్డిలు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆంజనేయస్వామి హుండీలో డబ్బుల్లేవని, మల్లన్న ఆలయ హుండీలో సుమారు రూ.3 వేలు ఉన్నాయని తెలిపారు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

అనారోగ్యంతో కోటయ్య మేస్త్రీ మృతి



కోటయ్య (ఫైల్)

వీణవంక: ఇళ్లు, ఆలయాల నిర్మాణాల్లో తనదైన ముద్ర వేసిన కోటయ్య మేస్త్రీ మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని బేతిగల్‌కు చెందిన ఇజ్జగిరి కోటయ్య(50) హుజూరాబాద్ నియోజకవర్గంలో 35 ఏళ్లలో 200కు పైగా ఇళ్లతోపాటు ఆలయాలు నిర్మించి, కోటయ్య మేస్త్రీగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన వద్ద పని చేసిన ఎంతోమంది కూలీలు ప్రస్తుతం మేస్త్రీలుగా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కోటయ్య తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్‌లో ఆదివారం కోతి దాడి చేయడంతో మిట్టపల్లి వెంకటమ్మ అనే వృద్ధురాలు గాయపడిందని స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు ఆమెను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఫైనల్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు



ఫైనల్ చేరిన కరీంనగర్ జిల్లా జట్టు

- నేడు హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్, వరంగల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం సాయంత్రం సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23–21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది. రెండో సెమీ ఫైనల్లో వరంగల్ జట్టు 28–15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై విజయం సాధించింది. సోమవారం ఉదయం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. అలాగే, మూడు, నాలుగో స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం..

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం లభిస్తాయని ఆర్ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, సురేశ్ అన్నారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో రెండో రోజు రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను



హ్యాండ్‌బాల్ సెమీ ఫైనల్లో తలపడుతున్న క్రీడాకారులు

వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ వెంకటేశ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

శబరిమల వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- బెంగళూరులో గుండెపోటుతో ధర్మారంవాసి మృతి



జంపయ్య (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లిన ఓ వ్యక్తి.. తిరుగు ప్రయాణంలో గుండెపోటుకు గురై, మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం మండల కేంద్రానికి చెందిన సమ్మంగి జంపయ్య(40) కరీంనగర్ జిల్లా బావుపేట క్వారీలో లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన మిత్రులతో కలిసి శబరిమల వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వివిధ ప్రాంతాల్లో దైవ దర్శనం చేసుకుంటూ ఆదివారం బెంగళూరు చేరుకున్నాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత ఛాతిలో నొప్పిగా, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉందని తెలిపాడు. దగ్గరలోని మెడికల్ షాప్‌కు వెళ్లి, మందులు తీసుకుంటుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

దాడిలో తల్లీకుమారులకు గాయాలు

- ఇద్దరిపై కేసు
- భూ వివాదమే కారణం



గాయపడిన పుష్పలత, కరుణాకర్, జగన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): భూ వివాదం కారణంగా జరిగిన దాడిలో తల్లీకుమారులు గాయపడ్డారు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన గడ్డం ఆనందం బండలింగంపల్లిలో నర్సయ్యకు సంబంధించిన 1.08 గుంటల భూమిని 2020లో కొనుగోలు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన బందుక శ్రీనివాస్, నరేశ్(తండ్రీకుమారుడు)లు నర్సయ్య విక్రయించిన భూమి తమదేనని ఆదివారం గొడవకు దిగారు. సదరు భూమి చదును చేయకుండా ఆనందం భార్య పుష్పలత, కుమారులు కరుణాకర్, జగన్‌లను అడ్డుకున్నారు. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించడంతో దుర్భాషలాడుతూ ఆ ముగ్గురిపై గడ్డపార, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో తల్లీకుమారులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆనందం ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒక్కచోటకు 300 మంది శ్రీనివాస్‌లు



ఆత్మీయ సమ్మేళనంలో శ్రీనివాస్ పేరున్నవారు

జగిత్యాల క్రైం: ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీనివాస్ అనే పేరున్న 300 మంది ఒక్కచోట చేరారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పేరిట కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, వాట్సాప్ అడ్మిన్, ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అబ్బాయి.. కేరళ అమ్మాయి

- దుబాయ్‌లో పరిచయమై.. పెళ్లితో ఒక్కటైన జంట



వివాహం చేసుకున్న అజయ్-అజిత

మెట్‌పల్లిరూరల్: దుబాయ్‌లో పరిచయమైన తెలంగాణ అబ్బాయి.. కేరళ అమ్మాయి పెళ్లితో ఒక్కటయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం అల్లూరి సీతారామరాజు తండాకు చెందిన గుగ్లావత్ అజయ్ నాలుగేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ తాను పని చేస్తున్న కంపెనీలో కేరళకు చెందిన అజితతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారింది. వివాహం చేసుకోవాలని నిశ్చయించుకొని, తమ పెద్దలను ఒప్పించారు. ఆదివారం కేరళలో అక్కడి సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు.

రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాలకు చెందినవారు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సతీమణి, కుటుంబసభ్యులు పూజలు చేసి, కోడెమొక్కు చెల్లించుకున్నారు.



కోడె మొక్కు చెల్లిస్తున్న విప్ బీర్ల ఐలయ్య కుటుంబీకులు

